

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## మళ్ళీ మొదలైంది

# మామిడి తాండ్రా - మర్డర్ అటెంప్టా

**చాలా ఏళ్ళయిపోయింది కదా అని మెల్లిగా ముందుతలుపు తీసి,** కాళ్ళీడ్చుకుంటూ మెయిల్ బాక్సు దగ్గిరికెళ్ళా. అది మా ఆవిళ్ళాగే నిండు చూలాలిలా ఉంది. కొంత మెయిలు కిందపడి, రెణ్ణెల్ల క్రితం పడ్డ వానకి తడిసి, వెలిసి, అహల్యలా నాకోసం వెయిట్ చేస్తోంది. నేను ఓ మాటు కాలితో అటూ ఇటూ తిప్పి చూసి, అవసరం లేదులే, జంకు మెయిలే అని సంతృప్తి చెంది, వంగే ఓపిక లేక అలాగే ఉణ్ణిచ్చేసా. సరే ఎలాగూ ఇక్కడిదాకా వచ్చాం కదా అని, కష్టపడి మెయిల్ బాక్సు ఓపెన్ చేసా. కొన్ని వందల కాగితాల కట్టలు, పేకెట్టులు, పోలీసు వారి టిక్కెట్టులు, ఇవి చాలనట్టు మా హోం ఓనర్సు వారు పెట్టిన వార్నింగు లెటర్సు, కోర్టు ఆర్డర్సు, కోవర్టు ఆర్డర్సు, ఇలా నానా కంగాళీగా ఉంది సీను. అన్నీ ఎత్తి, ఇంట్లోకి మోసుకొచ్చేసరికి రెండు పౌండ్లు తగ్గాను. ఆఫీసుకి ఓ నాల్రోజులు సెలవు పెట్టి అవన్నీ తీరిగ్గా జల్లించే సరికి, నిజంగా కొంపలంటుకునే లెటర్లు ఓ పది కనబడ్డాయి. లేటు ఫీజులు, కోర్టు ఫీజులు, అమాంబాపతు ఓ రెండువేలు దాకా వదిలింది. అప్పుడు నా నెత్తిమీద బోధి వృక్షం వెలిసింది, బుధ్ధి వికసించింది, మొహం వెలిగింది. ఇహ జన్మలో ఈ యాతన పడకూడదు అని ఒక డిసైడ్‌మెంటు అయిపోయాను. ఇది జరిగి నెల రోజులౌతోంది. ఈ నెలలోనూ అవసరం ఉన్నా లేకపోయినా ప్రతి గెంటకోసారి మెయిల్ బాక్సు తెరవడం, చూడడం, రావడం, ఇదే పధ్ధతి. రాత్రి నిద్ర పట్టకపోతే, మెయిల్ బాక్సు దాకా వాక్ చెయ్యడం, చూడ్డం, రావడం, ఆదివారాలతో సహా. మనకి ఏ వెట్టి పడితే ఆ వెట్టే కదా..

క్రితం ఆదివారం ఒకే ఒక్క కాగితం కనబడింది, *ఆఖరి నోటీస్* అని భయపెడుతూ. ఏవిట్రా భగవంతుడా అని చూస్తే, ***"మీ పచ్చగడ్డి లోని ఒక పరక  అర సెంటీమీటరు ఎక్కువ పెరిగింది. దీని వలన మా ఇళ్ళ అందము చెడుచున్నది. అవి అమ్ముకొందామన్నా, కొనే నాథుడు లేక మేము అల్లల్లాడుచున్నాము. కాన, నీవు వెంఠనే తగిన చర్యలు***

***తీసుకొననిచో, మేమంతా కలిసి, నీమీద తగిన చర్యో, తగని చర్యో ఏదో ఒకటి తీసుకోవలసి ఉంటుంది. ఖా..ప..డ్‌దా..ర్."*** అని వుంది. వీళ్ళ జిమ్మడిపోను, కొత్త పెళ్ళికొడుకు పొద్దెరగడన్నట్టు, ఈ అసోసియేషను మొతా గాళ్ళ కళ్ళన్నీ నా ఇంటిమీదే ఎహెప్పుడూను. పోనీలే, ఆ పరక కాస్తా కట్ చేసేస్తే, వీళ్ళ ఇళ్ళు అమ్ముడుపోయాయికదా, పోతారు పీనుగులు, అనుకుని, జాగ్రత్తగా ఆ గడ్డి పరకని ఏరి పట్టుకుని, కసిగా కసకసా కోసి పారేసాను తాండ్రపాపారాయుళ్ళా. కత్తెర పట్టుకుని ఇంట్లో కొచ్చేసాను. ఇజ్జరిగి వారం అయిపోయింది. ఈ శనాదివారాలు విస్తళ్ళు బయటే. ఏవో పార్టీలు తగలడ్డాయి. నిన్నంటే శనివారం నాడు ఉదయం ఫలహారం నించీ, మిడ్నయిటు స్నాకు దాకా బయటే. ఆదివారం కాస్త గేప్ ఇచ్చారు దిక్కుమాలిన ఫ్రెండుగాళ్ళు. బ్రేక్ ఫాస్టుకెవడూ పిలవలేదు. కాబట్టి లేటుగా లేచి, లంచి పార్టీ కెళ్ళొచ్చేసి, పడుకుని లేచి సాయంత్రం పార్టీకి రెడీ అవుతున్నాం.

అంతా కారెక్కాకా గుర్తొచ్చి, కారు అలా రివర్సులోనే , రోడ్డు మధ్యలో ఉణ్ణిచ్చేసి, కారు డోరు బార్లా తెరిచి పెట్టి, మెల్లిగా వెళ్ళి మెయిల్ బాక్సు తెరిచా, అలవాటు ప్రకారం. దాన్లో రెండు చిన్న జిప్పులాకు కవర్‌లూ, ఒక సీల్డ్ కవరూ ఉన్నాయి. సీల్డు కవర్ మీద **ఆవకాయి..** అని రాసుంది. మిగిలిన రెండిటిమీదా ఏవీ రాసిలేదు. రాయడవెందుకూ, సొష్టంగా కనిపిస్తూంటే. ఒహటి బెల్లం మితాయి అచ్చుల కవరూ, మరొహటి మావిడి తాండ్రాను. పాపం, అన్నో, తమ్ముడో ఎవరో సర్‌ప్రెయిజుగా పంపించుంటారు, అనుకుంటూ వెంఠనే కవర్ ఓపెన్ చేసి, రెండు బెల్లం మితాయచ్చులు నేనూ, తాండ్రముక్క మా ఆవిడా నోట్లో వేసుకున్నాం. మాలాంటి సాపాటు రామన్నలూ, సీతమ్మలూ తన పేరెంట్స్ అయినందుకు కించిత్ వగచింది, వెనకసీట్లో ఉన్న నా కూతురు, తల కొట్టుకుంటూ. ఇంతలో ఇంటెదురుగా రోడ్డుమీద ట్రాఫిక్ జాం అవడంతో మెల్లిగా కారు డోరు వేసి, కాస్త వారగా పార్క్ చేసా. గరాజు తెరిచి, ఆ పొట్లాలు అక్కడ పెట్టేసి పార్టీకి బయల్దేరాం.

కారు కదలగానే చెయ్యి ఐఫోను మీదకి, మనసు మనవాళ్ళమీదకి పోయింది. విలాసంగా అన్నకి ఫోన్ చేసాను. ***"ఏరా, ఎలా వున్నావు. బెల్లం మితాయి అదుర్సు, తాండ్ర దడ దడ్సు, ఆవకాయ ఇంకా తినలా. రేపు చెప్తా , తిన్నాకా..."*** అన్నాను చిద్విలాసంగా.

అటునించి కాసేపు నిశ్శబ్దం.

సిగ్నల్ ప్రోబ్లమేవన్నా ఉందేమో అని ***"హ...లో.... హె...ల్లో..."***అని తెగ నీలుగుతున్నాను ఇట్నించి నేను.

***"ఏహె ఊరుకో. ఇంతకీ నువ్వు తిన్నాకా ఏవన్నా మిగిలితే నాకు పోస్టు చెయ్యి. ఎందుకంటే, నాకు తెలిసి, నేను నీకు గత కొన్ని నెలలుగా ఏవీ మెయిల్ చెయ్యలేదు. ఇంతకీ పేకెట్లమీద ఫ్రం ఎడస్సు ఏడిసిందా లేదా? "*** అన్నాడు చికాగ్గా.

అప్పుడు వెలిగింది. నిజమే, ఆ పాకెట్లు వి..డి పేకెట్లు. ఫ్రం ఎడ్రస్సే కాదు, టు ఎడ్రస్సు కూడా లేదు వాటి మీద. అంటే...అయ్యబాబోయ్..నాకెందుకో కాస్త భయం మొదలైంది. అంచేత ***" వొరేయ్, నేను నీకు ఇప్పుడే చేస్తాను, ఎడం కన్నెందుకో అదురుతోంది..."*** అనేసి కట్ చేసేసా.

***" పోనీ మీ తమ్ముడికి చెయ్యండి, వాళ్ళేవైనా సర్ప్రైజ్ ఏర్పాటు చేసారేమో..."*** అంది భయం భయంగా మా శాల్తీ.

భయం తమ్ముడి మీద కాదు, పేకెట్ మీద అని మనవి. సరే చేసాను. ***"వోరేయ్, నీ సర్ప్రైజ్ బానే వుంది గానీ, మరీ ఎడసు కూడా లేకుండా పోస్టాఫీసు వాళ్ళని ఎలా మేనేజ్ చేసావురా?"*** అన్నాను కూల్ గా.

***"అన్నాయ్.. నాకు తమిళం రాదు."*** అన్నాడు వాడు.

***" నేను మాట్లాడి పూడిచింది తెలుగేకదా.."*** అన్నాను పీలగా.

***"కరెష్టే, కానీ, పేకెట్టేవిటో, పోస్ట్‌మాన్ ఏవిటో, సర్ప్రైజ్ ఏవిటో..అస్సలు ఎణక్కుం తెరియాదు.."*** అన్నాడు. మళ్ళీ ఫోను కట్ చేసేసా. ఇంతలో రెండు రెడ్ లైట్లు గెంతేసి, ఇరవై రెండు హాంక్ లు కొట్టించుకుని దూసుకెళిపోతున్నా.

మా పిల్ల గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని డిక్కీలో కూర్చుని అరుస్తోంది..***"బాబోయ్..వొరేయ్ నా బాబోయ్..చూసి నడపండ్రా దేవుడోయ్..."*** అంటూ.

నా బుర్ర శత వేగంతోటి, మా శాల్తీ బుర్ర సహస్ర వేగంతోటీ పరిగెడుతున్నాయి, కారుకన్నా వేగంగా. తెగ ఆలోచించేస్తున్నాం ఇద్దరమూ.

***"పోనీ, మన సబ్ డివిజన్ లో తెలుగువాళ్ళకి ఫోను చెయ్యండి, వాళ్ళేవన్నా పెట్టారేమో.."*** అంది ఆవిడ. సరే అని అందరికీ చేసాను. మాకేపాపమూ తెలియదనీ, అసలు అలాంటి స్వీట్లు తినమనీ, ఒట్టేసి చెప్పి ఫోను కట్ చేసేసారు.

ఆశ ఛావక సబ్ డివిజన్‌లో ఒక తెల్లాడికి కూడా చేసా. వాడు ఫోనెత్తి, ***"మేం ఇలాంటి జంక్ పెట్టం. పెడితే గిడితే నోటీసులు పెడతాం, నువ్వు ఫోను పెట్టేయ్.."*** అని నేను పెట్టాకా, వాడు ఫోను పెట్టాడు.

మా ఇద్దరికీ విపరీతమైన టెన్షన్ గా ఉంది. ఇంతలో పక్కన **"వెల్ కం టు సౌత్ కరోలీనా"** అనే బోర్డు చూసి, అయ్యబాబోబ్, మనది జార్జియా కదా, రాష్ట్రం దాటేసాం గావాల్ను..అని జడుసుకుని, కారు వెనక్కి తిప్పి మళ్ళీ పార్టీ తాలూకు ఇంటికి బయల్దేరా.

ఇంతలో అన్న ఫాలో అప్ కాల్. ***"ఏరా, తెలిసిందా ఎవరు పెట్టేరో..?"*** అన్నాడు ఆందోళనగా.

***"లేదురా.."*** అన్నాను నీరసంగా.

***"సర్లే, పెడితే పెట్టేరు గానీ, మీరేవీ ముట్టుకోకండి, ఎవడికి తెలుసు, దేంట్లో ఏం కలిపారో, అసలే నీకు స్వీటు చూస్తే వొళ్ళు తెలియదు.."*** అన్నాడు.

***"అంటే, ఆల్‌రెడీ..."*** అనేసి నాలిక కరుచుకుని, ***"సర్లే, సర్లే, ఛచ్చినా ముట్టుకోము. అసలు దాని సంగతి తేల్చేదాకా, ఆ పేకెట్లని అబ్జర్వేషన్ లో పెడతాం.."*** అనేసి హామీ ఇచ్చేసి ఫోను పెట్టా.

ఇలాగే తమిళం రాని మా తంబి గాడూ, చుట్టుపక్కలవాళ్ళూ, చుట్టాపక్కాలూ అందరూ ఫాలో అప్ కాల్సు చేసి, నానా జాగ్రత్తలూ చెప్పి ఫోను పెట్టేసారు.

మేం పార్టీలో వున్నామన్న మాటే గానీ మనసు మనసులో లేదు.

***"ఒసేయ్, నిజంగానే సైనేడ్ లాంటివేవన్నా కలిపేరంటావా?"*** అన్నాను నెమ్మదిగా.

***"ఊరుకోండి, మీకసలేవీ తెలీదు. సైనేడు తింటే సెకనులోపల టపా కట్టేస్తారు. మనం తిని రెండు గెంటలైంది.."*** అంది ఊరటగా.

***"మరి ఇంకేం అయుంటుంది.."*** అన్నాను అనుమానంగా.

***"బహుశా ఆర్సెనిక్ పాయిజనింగ్ అనుకుంటా... అదైతే కొన్ని గెంటల్లో, కొన్ని రోజుల్లో పడుతుంది, సరిగా గేపకంలేదు, ఇంటర్ మీడియట్లో చదివాను.."*** అంది.

***"అమ్మబాబోయ్, ఆర్సెనిక్కే...ఇంతకీ ఎవరు పన్నుంటారే ఇంత కుట్ర..."*** అన్నాను.

***"ఏవుందీ, మీరు గడ్డి సరిగ్గా కొయ్యట్లేదని మన హోం వోనర్సు అసోసియేషన్‌లో తెల్లాళ్ళు ఏవన్నా చేసారేమో.."*** అంది.

***"ఛ అయ్యుండదే వాళ్ళకి పాపం బెల్లం మిఠాయిలూ, మావిడి తాండ్రలూ గట్రా చెయ్యడం రాదే."*** అన్నాను.

***"ఆ, తెలిసిపోయింది, తెలిసిపోయింది..."*** అంది మాయాబజార్ లో సీ.ఎస్. ఆర్ లా.

***"చెప్పు, చెప్పు.."*** అన్నాన్నేను.

***"క్రితం సరి తెలుగు అసోసియేషన్ ఎలక్షన్స్‌లో మీరు ఫలానా వాళ్ళకి వోటు వెయ్యలేదు కదా, వాళ్ళేవన్నా పెట్టుంటారేమో..."*** అంది.

***"ఓసినీ క్రిమినల్ బ్రెయిన్ పాడుగానూ, నిజంగా వాళ్ళే చేసుంటారంటావా?"*** అన్నాను అనుమానంగా. ***"ఖచ్చితంగా...మనమిద్దరం పోతే, ఈసారి వాళ్ళకి రెండు వోట్లు లాభం. అందుకే రిస్క్ చేసి వుంటారు. "*** . ***"ఏదో,***

***గుళ్ళోనూ, వేర్ హౌసు దుకాణాల్లోను కలిసి, డబ్బులిచ్చి మరీ మెంబర్లని చేయించుకుంటున్నారని విన్నాను గానీ, మరీ ఇంత ల్లా  క్కుట పన్నరేమోనే."*** అన్నాను.

***"మీకేవీ తెలియదు. ఈ మాటు ఎలెక్షన్లకోసం ఎంపిక చేసిన మెరికల్లాంటి గూండాలని వీసాలిచ్చి మరీ తెప్పిస్తున్నారట  మనదేశం నించి.."*** అంది కన్ఫర్మ్ చేస్తూ.

***"అయితే మనం పోతావంటావా.."*** అన్నాను దిగులుగా. ఆవిడ మౌనంగా తలూపింది. ఇద్దరమూ జాలిగా మా అమ్మాయికేసి చూసాం.

అది అప్పటికే డిన్నరు కానిచ్చేసి, ఎవరిదో ఐ.పేడ్ తీసుకుని ఆడుకుంటోంది. మాకు కన్నీళ్ళు ఆగలేదు. రేప్పొద్దున్నకల్లా యీ దిక్కుమాలిన ఆర్సెనిక్ కడుపులోంచి ఊపిరితిత్తుల్లోకొస్తుంది. ఆనక గుండెలోకెళుతుంది. అప్పుడు లబ్..డబ్ మనాల్సిన గుండె కేవలం **"లబ్..లబ్"** మంటుంది. తరవాత **"లబో..దిబో.."** మంటుంది. ఆనక ఏవీ అనకుండా ఊరుకుంటుంది. ఆవిడ సిచ్చుయేషన్ కూడా సేం టు సేం. అప్పుడు ఈ పిల్ల ఓ నాలుగు గెంటల తరవాత ఐ.పేడ్ లో బేటరీ అయిపోయాకా, తల పైకెత్తి చూసి, అమ్మా నాన్నా లేరని తెలిసి..." . ***ఓ భగవాన్..హెంత పహని చేసావయ్యా. హేవిటీ..మాకీ పరీక్ష...హెందుకు...అసలు హెందుకు..."*** అనుకుంటూ కణతలు **(అంటే ఏవిటి?)** నొక్కుకుంటూ, పాత నవలలు గుర్తు తెచ్చుకుంటూ బాధపడుతున్నాం నేను, మా యావిడా. అప్రయత్నంగా **"మాతృదేవోభవ"** సినిమా గుర్తొచ్చింది. అవును, ఆర్సెనిక్ మా గుండెల్ని చేరకముందే, దీన్ని ఒక గూటికి చేర్చాలి. చేర్చాలి.. అనుకుంటూ మాకు అందరికన్నా క్లోజు అనుకున్న ఓ ఫ్రెండు దగ్గరికెళ్ళాను.

నా మొహం చూసి ***"నిజవేరా, నాక్కూడా ఆ ఎపటైజరు పడలేదు. కడుపులో గుడగుడగా ఉంది.."*** అన్నాడు.

***"అది ఎపటైజరు మొహం కాదురా, ఆర్సెనిక్ మొహం.."*** అని జరిగింది చెప్పాను.

వాడు ఓ నవ్వు నవ్వి ***" ఒరేయ్, దిక్కుమాలిన సినిమాలు చూడ్డం, మీ ఆవిడకి చూపించడం మాను ముందు. ఎవడికి తీరికరా, నీకు బెల్లం మిఠాయిలో విషం పెట్టి, మీ ఆవిడకి మావిడితాండ్రలో మందెట్టి చంపేయడానికి. అంతగా చంపాలనుకుంటే కారు గుద్దేస్తారుగానీ, మరీ ఇంత ఓపికగా ఎవడు చేస్తారా? "*** అన్నాడు భరోసాగా.

***"అంతేనంటావా.."*** అన్నాను అనుమానంగా.

***"కాకపోతే, అయినా ఒహవేళ పెర్ సపోజ్ మీరు పోయినా, మీపిల్లని నేను పెంచుతాలే..భయపడి ఛావకు.."*** అనేసి, మసాలా మార్గరీటావో మరో దిక్కుమాలిన డ్రింకో తాగడానికి వెళిపోయాడు.

తాగినోడి మాటలెలా నమ్మడం? అందుకే నేనూ, మా ఆవిడా ఓ సోఫాలో కూలబడ్డాం. ఎందుకో కాళ్ళన్నీ లాగేస్తున్నట్టూ, వళ్ళంతా బలహీనమైపోతున్నట్టూ అనిపిస్తోంది సమయం గడిచేకొద్దీ. మాపిల్ల తలెత్తి చూసింది. అంటే ఐ.పేడ్ లో బేటరీ అయిందని అర్థం. అర్థరాత్రి దాటిందని సంకేతం. ఈసురో మంటూ ఇంటికొచ్చాం. దారిలో నిజంగానే ఎవడన్నా సేఫ్టీ కోసం కారు గుద్దేస్తాడేమోనని బిక్కు బిక్కు మంటూ వచ్చాం.

ఇంట్లో కొచ్చి, ఎందుకేనా మంచిదని దేవుడికి ఆఖరి అగరొత్తి కూడా వెలిగించేసాం. అప్పుడు సెల్ ఫోన్ లో టెక్స్ట్ మెసేజి వచ్చింది.

***"శీనూ, నేను, నిన్ననే ఇండియానించొచ్చాం. మీకిష్టమని స్వీట్లు పట్టుకొచ్చాం. మీరు మధ్యాన్నం లేరు. అంచేత మెయిల్ బాక్స్‌లో పెట్టేసాం. టాక్ టు యు లేటర్.."*** అంటూ మా పక్క సబ్ డివిజన్ ఫ్రెండు మెసేజి.

మా ఆనందానికి అవధుల్లేవు. మా పిల్లనెత్తుకుని ఓ మాటు గిరగిరా తిప్పేసాం. దానికి కళ్ళు తిరిగాయి. అది ఊగుతూ, దాని గదిలోకెళ్ళి పడుకుండిపోయింది.

నేను మా పార్టీ ఫ్రెండుగాడికి ఫోను చేసి..***"మేం చచ్చిపోవట్లేదోచ్..మాపిల్లని మేవే చూసుకుంటాం.."*** అనేసాను.

వాడు ఏ మత్తులో ఉన్నాడో ఏమో..***"అయాం సారీరా. బెటర్ లక్ నెక్ట్ టైం.."*** అనేసి ఫోను పెట్టేసాడు.

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

POST YOUR COMMENTS